క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

సైదాపురం: ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి కోరారు. ఆయన శనివారం సైదాపురంలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.50 వేలకు మించి నగదు తరలించాలంటే తప్పనిసరిగా రశీదు ఉండాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 8.144 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 8.144 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

30 బాటిళ్ల మద్యం స్వాధీనం

కోట: కోట క్రాస్ రోడ్డు వద్ద శనివారం 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల్లో భాగంగా క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గూడలికి చెందిన ప్రవీణ్ బైక్‌లో కోట నుంచి స్వగ్రామానికి వస్తుండగా పరిశీలించారు. అతని వద్ద 30 మద్యం సీసాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తాటిచెట్లను ఢీకొని నిలిచిపోయిన మినీ బస్సు

చిట్టమూరు(చిల్లకూరు): మండలంలోని ఎల్లసిరి గ్రామ సమీపంలో శనివారం రొయ్యల పరిశ్రమకు కార్మికులను తీసుకెళ్లే మినీ బస్సు అదుపుతప్పి తాటి చెట్లను ఢీకొంది. ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికుల కథనం మేరకు.. చిల్లకూరు మండలం పున్నపువారిపాళెం సమీపంలో ఉన్న రొయ్యల పరిశ్రమలో పను లు చేసేందుకు ఎల్లసిరితో పాటు చుట్టుపక్కల ఉన్న రెండు గ్రామాల నుంచి మహిళా కార్మికులు వెళుతుంటారు. వారిని తీసుకువచ్చేందుకు శనివారం వేకువజామున బస్సు బయలుదేరింది. గ్రామ పొలిమేరలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెండు తాటి చెట్లను ఢీకొంది. కార్మికులు ఉన్న సమయంలో ప్రమాదం జరిగి ఉంటే పలువురికి గాయాలయ్యేవని స్థానికులు అంటున్నారు.

ఘనంగా ఎన్‌బీకేఆర్ వార్షికోత్సవం

కోట: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో పాటు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు నాటక, నృత్య ప్రదర్శనలో పోటీ పడ్డారు. ఆటపాటలతో హోరెత్తించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. రవీంద్రారెడ్డి, కిషంధర్, హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గూడూరు రూరల్: బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కూరపాటి రవీంద్రబాబు మజ్జిగ పంపిణీ చేశారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని గూడూరు గాంధీనగర్ ప్రాంతంలోని శ్మశానవాటికలోని సమాధులను శుభ్రం చేసేందుకు సుమారు 300 మంది వచ్చారు. వారికి మజ్జిగ అందజేసినట్టు కూరపాటి రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో మినీ గురుకులం హెచ్ఎం మేరి ప్రియత, విశ్రాంత రెవెన్యూ అధికారి భారతమ్మ, సంస్థ ప్రతినిధులు యశ్వంత్, సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ 2024కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు, తత్సమాన విద్యార్హత కల వారు అర్హులని పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి 25 తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7780319955, 8179433557 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

4న కుంభాభిషేకం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ మందిరం కుంభాభిషేకం ఏప్రిల్ నాలుగో తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మందిర నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని, గ్రామస్తులు పాల్గొని తీర్థ ప్రసాదలు స్వీకరించాలని కోరారు.

ఓటు వజ్రాయుధం

- రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కిరణ్‌కుమార్ పిలుపు
- గూడూరులో భారీ అవగాహన ర్యాలీ



ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ర్యాలీలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్, డీఎస్పీ తదితరులు

గూడూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని గూడూరు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వీప్ ఆధ్వర్యంలో శనివారం గూడూరులో 2 వేల మందితో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ముత్యాలపేట, ఆస్పత్రి రోడ్డు, సంఘం సినిమా థియేటర్ మీదుగా టవర్ క్లాక్ సెంటర్ వరకు సాగింది. అక్కడ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందని వివరించారు. వారు ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి నిర్భయంగా ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారు నిర్భయంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కోరారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు పలువురు నాయకులు ప్రయత్నిస్తుంటారని, అలాంటి వారిని గుర్తించి ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఓటరు హెల్ప్‌లైన్, సీ విజిల్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం, నగదు, గిఫ్టులు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి మురళీ, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డీఎల్‌డీవో వాణి, డీఎల్‌పీవో వెంకటరమణ, నియోజకవర్గ నోడల్ అధికారి కాంచన, కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



దశరథరామిరెడ్డి భౌతికదేహంపై పూలమాల వేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలోని 9వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత చప్పిడి దశరథరామిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం అక్కడికి చేరుకున్నారు. దశరథరామిరెడ్డి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆ వార్డులోని మరో వైఎస్సార్ సీపీ నేత శ్రీపురం సుబ్రమణ్యం తల్లి సుబ్బమ్మ ఇటీవల మృతి చెందారు. వారి ఇంటికి వెళ్లి సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేత దశరథరామిరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం నేతకు నివాళి

పట్టణంలోని 15వ వార్డు గొల్లపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ ముస్లిం నేత సయ్యద్‌మునీర్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ గ్రామానికి చేరుకున్నారు. సయ్యద్‌మునీర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. అన్ని సమయాల్లోనూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



సయ్యద్‌మునీర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మస్తాన్‌యాదవ్

పార్టీ విజయానికి కృషి చేయండి



మేరిగ మురళీధర్‌ను కలిసిన గాంధీనగర్ వాసులు

గూడూరు రూరల్: పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వైఎస్సార్ సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయనను శనివారం గూడూరు శివారు ప్రాంతాలు గాంధీనగర్, దివిపాళెం, అడివి కాలనీ, చవటపాళెం, సుందరయ్య కాలనీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో పార్టీ ఎలా ఉందన్న విషయాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వారు పొందిన లబ్ధిని వివరించి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గురుమూర్తిని గెలిపించేలా కృషి చేయాలని కోరారు. ఎన్నికల అనంతరం కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టి రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రవల్లిక, రమేష్, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రచార సామగ్రి స్వాధీనం

చిల్లకూరు: కారులో తరలిస్తున్న ఎన్నికల ప్రచార సామగ్రిని అధికారులు శనివారం బూదనం టోల్ ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపేటలో పర్యటిస్తున్న నేపథ్యంలో విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన నాగేంద్ర కారులో టీడీపీ క్యాప్‌లు, బీజేపీకి చెందిన కరపత్రాలను రవాణా చేస్తున్నాడు. అధికారులు టోల్ ప్లాజా వద్ద తనిఖీ చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

శిలాఫలకాలకు ముసుగులేవీ..?



ముసుగు వేయని టీడీపీ శిలాఫలకం

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో శిలాఫలకాలు, పార్టీల జెండాలు ఉన్నాయి. శిలాఫలకాలు, విగ్రహాలకు ముసుగు వేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోలేదు. గూడూరు పట్టణంలోని కోనేటి మిట్ట ప్రాంతంలో వాములమిట్టకు వెళ్లే దారిలో టీడీపీ నాయకులు జన చైతన్య యాత్రలో భాగంగా వేసిన శిలాఫలకం, పార్టీ జెండా యధావిధిగా అలాగే ఉన్నాయి.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని మునిరత్నం నగర్ సమీపంలో శుక్రవారం రాత్రి దుండగులు విజయలక్ష్మీ అనే మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేసి బైక్‌లో పరారయ్యారు. బాధితులు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. ఎంఆర్ నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీపతి, ఆతని భార్య విజయలక్ష్మీ పట్టణంలో టీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దుకాణం మూసుకుని బైక్‌లో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఎంఆర్ నగర్ సమీపంలో ఎదురుగా బైక్ వేగంగా వస్తుండడంతో వారు బైక్‌ను నిలిపి పక్కకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఒక్క సారిగా విజయలక్ష్మీ మెడలో ఉన్న సుమారు మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. కాలనీకి చెందిన యువకులు దుండగుల కోసం బైక్‌లలో గాలించినా ఫలితం లేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం





స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించి కల్యాణం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర ఘటోత్సవం

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం ఘటోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయ అనుబంధంగా వెలసిన పోలేరమ్మ జాతరను ప్రతి ఏటా ఉగాదికి ముందు వచ్చే మంగళవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించడం ఆనవాయితీ. దీన్ని ముత్యాలమ్మ జాతర అనే పిలుస్తారు. ఈ జాతరకు ప్రత్యేకత నెలకొంది. ఈ నేపథ్యంలో అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు సుమారు 5 లక్షల వరకు తరలివస్తారు. జాతర ప్రారంభానికి సంబందించిన ఘటోత్సవాన్ని గ్రామంలోని అత్తగారి ఇల్లు అయిన చాకలి వారి ఇంటి నుంచి కుండలో చద్ది పోసి తూర్పుకనుపూరు పంచాయతీలోని కొమరావారిపాళెం, రావులవారిపాళెం, పోసినవారిపాళెం, ఈదులవారిపాళెం గ్రామాల్లో ఊరేగిస్తారు. అనంతరం పుట్టిల్లు అయిన కుమ్మరి ఇంట బొమ్మను చేసి గంగమిట్ట మీద కొలువుదీరుస్తారు. ఇక అక్కడ నుంచి జాతర పూర్తి స్థాయిలో ప్రారంభమవుతుంది.



ఘటోత్సవంలో కుండతో గడప గడపకూ తిరుగుతున్న ఆసాదులు

2న పోలేరమ్మ జాతర మొదటి చాటింపు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర మొదటి చాటింపును వచ్చే నెల 2వ తేదీన చేపట్టనున్నట్టు ఈవో వై.శశాంక్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు, జాతర నిర్వాహకులు శనివారం విన్నమాల గ్రామంలో ఉన్న పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులురెడ్డి నివాసానికి వెళ్లి సంప్రదాయబద్ధంగా తాంబూలం అందించి జాతరకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఏప్రిల్ 2న మొదటి చాటింపు వేస్తామని తెలిపారు. అనంతరం వేదపండితుల సూచనల మేరకు మే నెల 27, 28, 29వ తేదీల్లో జాతర నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది యుగంధర్, తుమ్మూరు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి, జాతర నిర్వాహక కమిటీ సభ్యులు నల్లబోతుల రామారావు, మహేష్ రెడ్డి, ఆకుల కుబేరు మణి, రాగి శేషగిరి, నల్లబోతులు అంజయ్య, చిరంజీవి ఆచారి, వైఎస్సార్ సీపీ నాయకులు పోట్లపూడి రాజేష్, ఆలయ పూజారి మునిసురేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డికి తాంబూలం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

పేదల పార్టీ వైఎస్సార్ సీపీ





మృతునికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి, ఓట్లను అభ్యర్థిస్తున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

వెంకటగిరి రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. ఆమె శనివారం వెంకటగిరి రూరల్ మండలంలోని చెలికంపాడు, కుర్జాగుంట, మన్నేగుంట, పూలరంగడుపల్లి, అక్బర్‌నివాసకండ్రిగ, బొగ్గులమిట్ట ప్రచారం చేశారు. ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆమె ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తన భర్త మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి చేసిన పనులను తెలియజేశారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. పేద పిల్లలకు కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తున్నారని తెలిపారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తన బిడ్డ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చెలికంపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణ, పి.రమణయ్య, ఎం.రమణ్యయ్య, మాజీ సర్పంచ్ చెంచునాయుడు, నాగభూషణం, సుబ్బమ్మను నేదురుమల్లి రాజ్యలక్ష్మి పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మన్నేగుంట, కుర్జాగుంట గ్రామాల్లో మృతి చెందిన వెంకటసుబ్బయ్య, రమణయ్య ఇళ్లకు చేరుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాల్లిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటరమణమ్మ, సదారెడ్డి, కోటి, వెంకటరత్నంరాజు, సుబ్బారావు, బాలకృష్ణ, జనార్దన్, బాబు, ఆవుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచిని గుర్తించి వైఎస్సార్ సీపీని ఆదరించండి



లలితానగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ బి.అనీల్‌కుమార్ రెడ్డి తదితరులు

కలువాయి: మీకు జరిగిన మంచిని గుర్తించి వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని, తిరుపతి ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కలువాయి జెడ్పీటీసీ అనీల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం పెదగోపవరం, లలితానగర్‌లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన లబ్ధిని, పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. పేదలు, మహిళల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు పంగా పెంచలనరసారెడ్డి, సర్పంచ్ గంగవరపు ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చిల్లకూరు: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం వీఆర్వోలు, చౌక దుకాణం డీలర్లు, బియ్యం సరఫరా చేసే వాహనదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు రాజకీయాల జోలికి వెళ్లకూడదన్నారు. బియ్యం పంపిణీ చేసే వాహనాలపై ఎలాంటి ఫొటోలు లేకుండా స్టిక్కర్లు అంటించాలని సూచించారు. వీఆర్వోలు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా శిలాఫలకాలు, విగ్రహాలు ఉంటే వెంటనే ముసుగులు వేయాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



కోటలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు,

వాకాడు/కోట: ప్రజలను కాపాడేందుకు ఏసు ప్రభువు భూమిపై అవతరించారని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేము దినకర్‌బాబు తెలిపారు. వాకాడులోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల క్రైస్తవ సంఘ కాపరులు, క్రైస్తవులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ వాకాడు నుంచి వెంకన్నపాళెం మీదుగా కోట క్రాస్ రోడ్డు వరకు సాగింది. దినకర్‌బాబు మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ ప్రాముఖ్యతను లోకానికి చాటి చెప్పడానికి ఈ రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించినట్టు తెలిపారు. ర్యాలీలో సంఘకాపరి ప్రశాంత్‌బాబు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్: గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతంలోని పలు చర్చిలకు చెందిన క్రైస్తవులు శనివారం గూడూరు డివిజన్ పాస్టర్స్ లీడర్స్ అండ్ కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రన ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ డివిజన్ అధ్యకుడు డేనియల్ ఊలా రవికుమార్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు శాంతి మార్గాన్ని సూచించారని తెలిపారు. దాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించేలా శిలువపై మరణం పొందారని గుర్తు చేశారు. అనంతరం సజీవుడైన ఏసును ప్రతి ఒక్కరికీ పరిచయం చేసేందుకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మండే రవికుమార్, కోశాధికారి అబ్రహంజేమ్స్ ప్రభాకర్, ఏజే సాల్మన్, సుధీర్‌జాషువా, లాజరస్, బ్రదర్ మైఖేల్, టీజే మార్కు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు రూరల్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న యువతులు, మహిళలు



గూడూరు రూరల్: రన్ ఫర జీసస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఊలా రవికుమార్